# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 17-11-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 96 | పేజీలు:4 | వెల: రూ.1/-


## మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 16: నగరంలోని అత్తాపూర్‌లోని రాంబాగ్‌లో వారం రోజుల క్రితం జ్యోతి అనే మహిళ హత్య జరిగిన సంగతి తెలిసిందే. ఈ హత్య కేసులో శ్రీకాంత్ అనే వ్యక్తిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. జ్యోతి హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు తేల్చారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జ్యోతిని హత్య చేసిన శ్రీకాంత్ ఇంటికి తాళం వేసి పరారైనట్లు అంగీకరించాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జ్యోతి ఫోన్ కాల్స్ ఆధారంగా పోలీసులు శ్రీకాంత్ ను అరెస్టు చేశారు.

కర్ణాటక, బీదర్ ప్రాంతానికి చెందిన జ్యోతి (30), జీవన్ దంపతులు. కుటుంబ గొడవల కారణంగా జ్యోతి భర్తను వదిలేసి.. నాలుగు నెలలుగా అత్తాపూర్ రాంబాగ్‌లోని హనుమాన్ దేవాలయం వెనకాల ఉన్న ఇంట్లో ఇద్దరు కూతుళ్లతో కలిసి నివాసం ఉంటుంది. ఇండ్లలో పని చేస్తుంది. పెద్ద కూతురు కిషన్‌బాగ్‌లోని రెసిడెన్సియల్ పాఠశాలలో చదువుతుండగా చిన్న కూతురు స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో చదువుతుంది.

# పల్లాకు కీలక పదవి!

**- రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా రాజేశ్వరరెడ్డి**

**- నియామక ప్రక్రియ చేపట్టాలని అధికారులకు కేసీఆర్ ఆదేశం**

హైదరాబాద్,నవంబర్16(ఆర్ఎన్ఎ) : టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డికి కీలక పదవి వరించనుంది. కేబినెట్ హోదా కలిగిన రైతు సమన్వయ సమితి అధ్యక్ష పదవిని పల్లాకు అప్పగించేందుకు సీఎం కేసీఆర్ సిద్ధమయ్యారు. ఈ మేరకు నియామక పక్రియను చేపట్టాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా నియామక ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. హోరాహోరీగా సాగిన హుజూర్‌నగర్ ఎన్నికల్లో తెరాస అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించాడు. ఈ విజయంలో పల్లా రాజేశ్వరరెడ్డి కీలక భూమిక పోషించారు. మొదటి నుంచి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణం పల్లా రాజేశ్వరరెడ్డి పనులు చక్కబెడుతూ వస్తున్నారు. దీంతో కేసీఆర్‌కు విదేయుడిగా పేరుపొందాడు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పల్లాకు మంచి సంబంధాలు ఉన్నాయి. దీనికితోడు హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ఫలితాల అనంతరం పల్లా చేసిన కృషిని మంత్రులతో పాటు కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ అభివృద్ధికోసం పల్లా కృషిని గుర్తించిన కేసీఆర్ ఆయనకు తాజాగా ఈ పదవి కట్టబెట్టారు. పల్లా నియామకంతో పాటుగా రాష్ట్ర రైతు సమన్వయ సమితి సభ్యులను కూడా త్వరలోనే నియమించనున్నట్లు సీఎం వెల్లడించారని ముఖ్యమంత్రి కార్యాలయం పత్రికా ప్రకటనలో తెలిపింది. వచ్చే జూన్ లోపు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రైతు సమన్వయ సమితిలను బలోపేతం చేసి, రైతులను సంఘటిత శక్తిగా మార్చాలని సీఎం ఇప్పటికే నిర్ణయించారు. క్లస్టర్ల వారీగా రైతు వేదికల నిర్మాణం కూడా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. విత్తనం వేసే దగ్గర నుంచి పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులకు చేదోడు వాదోడుగా ఉండే విధంగా రైతు సమన్వయ సమితులను పటిష్టమైన పద్ధతుల్లో తీర్చిదిద్దాలని సిఎం భావిస్తున్నారు. రైతు సమన్వయ సమితుల బలోపేతం, రైతులను సంఘటిత శక్తిగా మార్చడం, రైతు వేదికల నిర్మాణం, ఇతర రైతు సంబంధ అంశాలపై మూడు నాలుగు రోజులలోనే వ్యవసాయ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని సిఎం నిర్ణయించినట్లు తెలుస్తుంది.

# రఫేల్‌పై రాహుల్ క్షమాపణలు చెప్పాల్సిందే

**బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్**

హైదరాబాద్,నవంబర్16(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ నాయకులు అవినీతి బురదలో కూరుకుపోయారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. సైన్యాన్ని సైతం అవమానపరిచిన చరిత్ర కాంగ్రెస్‌దేనని ధ్వజమెత్తారు. రాఫెల్ ఒప్పందంపై రాహుల్‌వి చవకబారు ఆరోపణలు అన్నారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మురకు బిజెపి ట్యాంక్‌బండ్‌పై ఆందోళనకు దిగింది. కాంగ్రెస్ చేసిన కుంభకోణాలే ఆ పార్టీని పాతాళంలోకి నెట్టాయని పేర్కొన్నారు. పెద్దనోట్ల రద్దును సైతం కాంగ్రెస్ రాజకీయంగా వాడుకుందని ధ్వజమెత్తారు. సర్జికల్ స్ట్రయిక్ ద్వారా భారత సైనిక శక్తిని మోదీ ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కాంగ్రెస్ దివాళాకోరు రాజకీయాల కారణంగా దేశం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఆర్టీసీ సమ్మె కారణంగా కెసిఆర్ నియంతలా మారి వేధిస్తున్నారని అన్నారు.

ఆర్టీసీ సమ్మెతో కెసిఆర్‌కు అహం పెరిగిందన్నారు. కార్మికుల పట్ల చులకన భావం తగదన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

# మూడో రోజు జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి బంద్



జమ్ము: జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి మూడో రోజు సైతం బంద్ అయింది. భారీ వర్షాల కారణంగా రహదారిపై కొండ చరియలు కూలాయి. భారీ వర్షం కారణంగా నేడు సైతం శిథిలాల తొలగింపు చర్యలకు విఘాతం ఏర్పడింది. దీంతో కశ్మీర్‌కు నిత్యావసర వస్తువులు తరలించే వేల వాహనాలు నిలిచిపోయాయి. కశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే ఈ రహదారిపై గడిచిన గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో భారీ స్థాయిలో కొండ చరియలు విరిగిపడ్డాయి. వెంటనే సహాయక చర్యలను చేపట్టారు. అయినప్పటికీ వర్షాల కారణంగా పనులకు అంతరాయం ఏర్పడుతుంది.

## చరిత్రలో నేటినిజం



కం॥ రోజా - రసాభినేత్రీ
రాజిల్లెను చలనచిత్ర రంగములోనన్
రోజా - ప్రజాధినేత్రీ
భ్రాజిల్లెను రాజకీయ రంగములోనన్ !!

(నవంబర్ 17 నటి, రాజకీయ నాయకురాలు రోజా జన్మదినం..)

-రాధశ్రీ

సెల్: 9494481210



# తండ్రి మందలించాడని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

హైదరాబాద్, నవంబర్ 16: నగరంలోని గచ్చిబౌలి జనార్ధన్ హిల్స్‌లో చరణ్‌రాజ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నిన్న రాత్రి భవనంపై నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు కొద్ది సేపటి క్రితం మృతి చెందాడు. పోటీ పరీక్షలకు గైర్హాజరైనందుకు తండ్రి మందలించారనే మనస్తాపంతో ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. అనంతపురం జేఎన్టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. మాదాపూర్‌లో ఓ ఇనిస్టిట్యూట్‌లో చరణ్‌రాజ్ శిక్షణ తీసుకుంటున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# విమానంలో ప్రయాణిస్తూ.. నాలుగు నెలల చిన్నారి మృతి

ముంబయి, నవంబర్16(ఆర్ఎన్ఎ) : విమానంలో ప్రయాణిస్తూ నాలుగు నెలల పసిపాప మరణించిన విషాద ఘటన ముంబయిలో వెలుగుచూసింది. సూరత్‌కి చెందిన ప్రీతి జిందాల్ తన నాలుగునెలల వయసున్నకూతురు, అత్తమామలతో కలిసి సూరత్ నుంచి ముంబై నగరానికి స్పైస్ జెట్ విమానంలో బయలుదేరింది. సూరత్ ఎయిర్ పోర్ట్ విమానం ఎక్కే ముందు ప్రీతిజిందాల్ తన చిన్నారి కూతురు రియాకు పాలు తాగించింది. అనంతరం పసిపాప నిద్రపోవడంతో వారు విమానం ఎక్కారు. స్పైస్ జెట్ విమానం ముంబయిలో దిగాక చూస్తే పాపను చూస్తే ఆమెలో చలనం లేదు. దీంతో ప్రీతిజిందాల్ విమాన సిబ్బందికి తెలియజేయడంతో వారు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ను సంప్రదించి వెంటనే వైద్యసహాయం కోసం ఏర్పాట్లు చేయమని కోరారు. వెంటనే పసిపాపను ముంబయిలోని నానావతి హాస్పిటల్ కు తరలించారు. పాపను పరీక్షించిన వైద్యులు అప్పటికే పాపచనిపోయిందని ప్రకటించారు. విమాన ప్రయాణంలో పసిపాప మృతి ఘటనతో తల్లి ప్రీతిజిందాల్ తోపాటు ఆమె అత్తమామలు కన్నీరుమున్నీరుగా రోదించారు. చిన్నారి మృతదేహాన్ని డాక్టర్ ఆర్ఎన్ కోపర్ మున్సిపల్ జనరల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించినా మృతికి కారణం తెలియలేదు. దీంతో పాప మృతదేహానికి రీ పోస్టు మార్టం జరిపించడం కోసం కూపర్ హాస్పిటల్ కు తరలించారు. ఈ ఘటనపై తాము దర్యాప్తు చేస్తామని స్పైస్ జెట్ అధికారులు తెలిపారు.

# మధ్యాహ్న భోజన పథకం వద్ద దుర్ఘటన

**బాయిలర్ పేలి నలుగురు మృతి**

పాట్నా,నవంబర్16(ఆర్ఎన్ఎ): బిహార్ రాష్ట్రం మోతీరి ప్రాంతం సుగౌలీలో శనివారం ఉదయం బాయిలర్ పేలింది. ఈ ప్రమాదంలో నలుగురు సజీవ దహనం కాగా 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా నిర్వాహకులు అన్నం వండుతుండగా బాయిరల్ పేలిందని స్థానికులు వెల్లడించారు. బాయిలర్ పేలుడు శబ్దం రెండు కిలో మీటర్ల వరకు వినిపించిందని గ్రామస్థులు తెలిపారు. వెంటనే స్థానికులు అక్కడి చేరుకొని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. వంట రూమ్ పూర్తిగా ధ్వంసమైందని గ్రామస్థులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం మోతీరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

# గోవాలో కూలిన నేవీ శిక్షణా యుద్ధ విమానం

**- సురక్షితంగా బయటపడ్డ పైలెట్లు**

ఫనాజీ, నవంబర్16(ఆర్ఎన్ఎ) : గోవాలో నౌకదళానికి చెందిన మిగ్-29కె శిక్షణా యుద్ధ విమానం శనివారం కూలిపోయింది. ఇందులోని ఇద్దరు పైలెట్లు సురక్షితంగా బయటపడ్డారు. వారిని రక్షించడానికి సహాయక చర్యలు చేపట్టినట్లు నేవీ అధికారులు తెలిపారు.

శిక్షణలో భాగంగా మిగ్-29కె గాల్లోకి లేచిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై నేవీ అధికార ప్రతినిధి వివేక్ మధ్వాల్ మాట్లాడుతూ.. మిగ్-29కె శిక్షణ యుద్ధవిమానం ఇంజిన్‌లో మంటలు చెలరేగడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. దీనిలోని పైలెట్లు కెప్టెన్ ఎం. షియోకాంద్, లెఫ్టినెంట్ కమాండర్ దీపక్ యాదవ్ సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఘటనా స్థలం నుంచి వారిని రప్పించడానికి సిబ్బందిని పంపినట్టు ఆయన వివరించారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

అయితే విమానం గాల్లోకిలేచిన కొద్దిసేపటికే ఓ పక్షి ఢీకొట్టినట్టు గుర్తించారు. దీనివల్ల ఇంజిన్‌లో మంటలు చెలరేగి ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మానుష్య ప్రదేశంలో విమానం కూలిపోవడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

# ఉధృతమైన ఆర్టీసీ కార్మికుల సమ్మె

- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలహోరు
- వేకువజామునే డిపోల ఎదుట ఆందోళనలు చేపట్టిన కార్మికులు
- ఆందోళన కారులను అరెస్టు చేసిన పోలీసులు

**అశ్వత్థామరెడ్డి హౌస్ అరెస్టు**

- నివాసంలోనే నిరవధిక దీక్షకు దిగిన అశ్వత్థామరెడ్డి
- ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు
- మరో మిలియన్ మార్చ్, మరో సాగరహారం కూడా చేపడతాం
- కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడొద్దన్న అశ్వత్థామ
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉద్రిక్తతం
- పెట్రోల్ బాటిల్స్, గ్యాస్ సిలిండర్‌తో పేల్చుకుంటామని మహిళా కార్మికుల బెదిరింపు

**- తమ డిమాండ్లు పరిష్కరిస్తేనే బయటికి వస్తామని వెల్లడి**

హైదరాబాద్, నవంబర్16(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులు సమ్మెను ఉధృతం చేశారు. తెల్లవారు జామునే రోడ్లపైకి వచ్చిన నిరసన తెలిపారు. ఆర్టీసీ సమ్మె వరుసగా 43వ రోజు కొనసాగుతోంది. బస్సురోకో నిర్వహించాలన్న ఆర్టీసీ ఐకాస పిలుపు మేరకు వేకువజాము నుంచే కార్మికులు డిపోల ఎదుట నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. కార్మికుల చర్యలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఆందోళన కారులను అరెస్టు చేస్తున్నారు. సమ్మెలో భాగంగా వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట డిపో ఎదుట ధర్నా చేసిన ఆర్టీసీ కార్మికులు, అఖిల పక్ష నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఐకాస, వామ పక్ష ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు రెండు బృందాలుగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. మొదట డిపో ఎదుట ధర్నా చేసి బస్సులను అడ్డుకున్న ఆర్టీసీ ఐకాస బాధ్యులు రవి, రాజయ్య, బి.రవి, తదితరులను పోలీసులు అరెస్టు చేయగా.. సీపీఎం, సీపీఐ, టీపీఎఫ్, ఎంఆర్పీఎస్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేశారు. వారిని పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. హైదరాబాద్ పాతబస్తీ ఫారూఖ్‌నగర్ డిపో ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. బస్సులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన 15 మందికార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఫలక్‌నుమా బస్సుడిపో ఎదుట ఆందోళన చేస్తున్న 40 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు సిద్దిపేటలోనూ నిరసనల పర్వం కొనసాగుతోంది. డిపో ఎదుట బైఠాయించిన కార్మికులు.. బస్సులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట జరిగింది. ఆందోళన చేస్తున్న కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ కార్మికుల ఆందోళనలు కొనసాగాయి. వేకువజామునే డిపోల వద్దకు చేరుకున్న కార్మికులు కార్మికులు, అఖిల పక్ష నాయకులు బైఠాయించారు. డిపోల నుంచి బస్సులు రాకుండా అడ్డుపడ్డారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### నిరసనగా నిరాహార దీక్ష ..

హైదరాబాద్‌లోని వనస్థలిపురం బీఎన్ రెడ్డి నగర్‌లో టీఎస్‌ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీంతో ఆయన నివాసంలోనే నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. పూల మాల ధరించి దీక్షను ప్రారంభించారు. ఆయనతోపాటు పలువురు మహిళలు కూడా ఉన్నారు. ఇంటి దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ.. సీఎం విధానాలతోనే కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. మరో మిలియన్ మార్చ్, మరో సాగరహారం కూడా చేపడతామన్నారు. ఆర్టీసీ జేఏసీ నాయకుల అరెస్టులను ఖండిస్తున్నామని తెలిపారు.

కార్మికులు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. అంతిమ విజయం మనదే అన్నారు. ప్రజలను, కోర్టులను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. చర్చలతో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామని చెప్పారు. జేఏసీ నేతలను అరెస్టు చేసి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్నారని తెలిపారు. పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసినా దీక్ష కొనసాగిస్తామని చెప్పారు.

మూడు రోజులుగా శాంతియు తంగా సమ్మె చేస్తున్నామని..కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా ప్రభుత్వం దమనకాండ ప్రదర్శిస్తుందన్నారు. మహిళా కార్మికులు అని చూడకుండా ట్యాంక్ బండ్ పై వారిపై దాడి చేశారని వాపోయారు. కోరి తెచ్చుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి ప్రవర్తన చాలా దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రధాన డిమాండ్ అయిన ప్రభుత్వంలో ఆర్టీసీ వీలినాన్ని తాత్కాలికంగా పక్కనబెట్టినట్లు చెప్పారు. చర్చలు జరుపకుండా, సమస్యలు పరిష్కరించుకుండా, నాయకుల ఇళ్లపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. కో కోన్వీనర్ రాజిరెడ్డితోపాటు డిపోల దగ్గర నిరసన తెలుపుతున్న నేతలను అరెస్టు చేసి ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తలపిస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్మికులు ఎవరూ భయపడద్దని..ధైర్యంగా ఉండాలన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. జేఏసీ నేతల దీక్ష పిలుపుతో టెన్షన్ నెలకొంది. దీక్షకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు బస్ రోకో, అన్ని డిపోల ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. జేఏసీ నేతలు దీక్షకు దిగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. జేఏసీ నేతల ఇళ్లు, ఈయూ ఆఫీస్ దగ్గర పోలీసులు మోహరించారు. అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ జేఏసీ ముఖ్య నేతల ఇళ్ల ముందు పోలీసులు భారీగా మోహరించారు. అటు ఎంఎ÷-లాయిస్ యూనియన్ కార్యాలయం దగ్గ భారీగా పోలీసులు మోహరించారు.

### భద్రాద్రి కొత్తగూడెంలో ఉద్రిక్తత..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆర్టీసీ మహిళా కార్మికులు ఆత్మహత్యాయత్నం చేశారు. 18మంది మహిళా కార్మికులు ఆర్టీసీ డిపోలోని సీఐటీయూ కార్యాలయంలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. పెట్రోల్ బాటిల్స్, గ్యాస్ సిలిండర్ తో పేల్చుకుంటామని బెదిరించారు. తమ డిమాండ్లు పరిష్కరిస్తేనే బయటికి వస్తామని లేదంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు యూనియన్ నాయకులు, మహిళలతో మాట్లాడారు. ఆత్మహత్య చేసుకోవద్దని.. వారిని బయటికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

కానీ పోలీసులు తలుపులు కొట్టినా మహిళలు బయటికి రాలేదు. ప్రభుత్వం చర్చలకు పిలిచి, సమస్యలను పరిష్కరించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కేసీఆర్ చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. బలవంతంగా బయటికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తే ఆత్మహత్యకు చేసుకుంటామని, తమ పిల్లలను కడపారి చూసుకోకుండా అవుతామని భీష్మించుకొని కూర్చున్నారు. మేము తెలంగాణ ఆడబిడ్డలం.. రాజకీయపార్టీలతో మాకు అవసరం లేదని, ఏవరైనా సరే కేసీఆర్ తో మాట్లాడి చర్చలు జరిపించాలని డిమాండ్ చేశారు.



ఆర్టీసీ జెఏసి కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి ఇంటి వద్ద మొహరించిన పోలీసులు

**అశ్వత్థామరెడ్డి హౌస్ అరెస్ట్..**

# చర్చలకు పిలవకుండా.. రెచ్చగొడతారా?

**- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

హైదరాబాద్, నవంబర్16(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ఆర్టీసీ కార్మికులపై దమనకాండను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. ప్రశాంతంగా నిరవధిక దీక్ష చేస్తామని ప్రకటిస్తే ఆర్టీసీ జేఏసీ నాయకులను గృహ నిర్బంధం చేసి.. వారి ఇళ్లపై పోలీసులు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్మికులను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కార్మిక సంఘాలు బాధ్యతాయుతంగా చర్చించి విలీన డిమాండ్‌ను వాయిదా వేసుకుంటున్నామని ప్రకటించినప్పటికీ, ప్రభుత్వం చర్చలకు పిలవాల్సిందిపోయి రెచ్చగొట్టే పద్ధతిని అవలంబిస్తోందని నారాయణ మండిపడ్డారు. రాష్ట్రంలో తక్షణమే ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నారాయణ విజ్ఞప్తి చేశారు. 43రోజులుగా సమ్మె చేస్తుంటే, కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కేసీఆర్‌కు చీమకుట్టినట్లయినా లేకపోవటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంది ఇందుకేనా..? అని నారాయణ ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికుల పట్ల కేసీఆర్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైన కేసీఆర్ తన తీరుమార్చుకోవాలని, మెట్టుదిగిన కార్మికుల పట్ల మర్యాదగా వ్యవహరించి వారిని చర్చలకు పిలవాలని, తద్వారా వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నారాయణ సూచించారు.

## ప్రజలు కర్రకాల్చి వాతపెట్టినా..

# కాంగ్రెస్‌కు బుద్ధిరాలేదు

**- బీజేపీపై బురదచల్లాలని చూస్తే ఊరుకోం**

**- రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలి**

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్**

హైదరాబాద్, నవంబర్16(ఆర్ఎన్ఎ) : రెండు దఫాలుగా దేశ ప్రజలు కాంగ్రెస్‌కు కర్రకాల్చి వాతపెట్టినా ఆ పార్టీ నేతల బుద్ధిలో మార్పు రాలేదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రఫేల్ వ్యవహారంపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆధారాలులేని ఆరోపణలుచేసి బీజేపీపై బురద చల్లాలని అనుకుంటే చూస్తూఊరుకోమని హెచ్చరించారు. రాహుల్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ క్షమాపణ చెప్పేదాకా దేశ ప్రజలు వదిలిపెట్టరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకాశం, పాతాళంలో కూడా కాంగ్రెస్ అవినీతి ఉంటుందని, కాంగ్రెస్ ఒక బెయిల్ గాడీ అని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఆలీబాబా దొంగల ముఠాలాంటిదని, దేశ సంపదను దోచుకొని విదేశాల్లో దాచుకున్నారని దుయ్యబట్టారు. రాహుల్ చిన్న పిల్లల మనస్తత్వంతో విమర్శలు చేస్తున్నారని, రఫేల్‌పై సుప్రీంకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చిందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. క్షమాపణ చెప్పడం కాదు, నోరు అదుపులో పెట్టుకోవాలని కోర్టు సూచించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్ భాష మాట్లాడుతున్నారని, కోడిగుడ్డుపై ఈకలు పీకే రాజకీయాలు నడవవని మండిపడ్డారు. దేశ భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచిస్తూంటే రాహుల్ మాత్రం అర్థంలేని విమర్శలు చేస్తున్నారని, మోదీకి మంచి పేరు వస్తుందనే రఫేల్‌పై రివ్యూ పిటిషన్ వేశారని ఎమ్మెల్సీ రాంచందర్ రావు విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి మోదీకి మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ధర్నాలో లక్ష్మణ్‌తో పాటు ఎమ్మెల్సీ రామచందర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పేట ఆస్పత్రికి మోక్షం ఎప్పుడో?

## అందుబాటులోకి వస్తుందా అన్న అనుమానం
## నత్తనడకన పనులు సాగుతున్నా పట్టించుకోని అధికారులు

సంగారెడ్డి,నవంబరు16(ఆర్ఎన్ఎ): ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొదటి మున్సిపాలిటీగా పేరున్న సదాశివపేట బల్దియాలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో వేగం పెంచాలని గతంలో కలెక్టర్ అధికార యంత్రాంగాన్ని, కాంటాక్టర్లను ఆదేశించినా ఫలితం కానరావడం లేదు.

పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ, నాబార్డు ద్వారా పట్టణంలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు రూ.4.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ పనులను 2015 జూన్ 9వ తేదీన మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తేవడం లేదు. గత పాలకవర్గం పట్టింపులేనితనం, అధికారుల నిర్లక్ష్యం సదాశివపేటను అభివృద్ధిలో ఆమడదూరంలో నిలుపుతున్నాయి. మున్సిపాలిటీ ఎన్నికలు ముంచుకొస్తున్నా అభివృద్ధి పనులు అడుగు కదలడం లేదు. పనులు ప్రారంభం జోరుగా ఉన్న పూర్తి చేయడం మాత్రం చిత్తశుద్ధి కనబరచడం లేదు. సదాశివపేట మున్సిపాలిటీకి వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండేళ్లవుతున్నా ఈ నిధులతో చేపట్టిన పనులు పూర్తికాలేవు. వికారాబాద్ రోడ్డు మార్గంలో రూ.50లక్షల విలువైన సెంట్రల్ లైటింగ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. రూ.1.30 కోట్లతో చేపట్టిన హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికల పనులు నత్తనడకన సాగుతున్నాయి. మిగతా పనులు నిధుల లేమి, టెండర్ల దశల్లోనే మూలుగుతున్నాయి. రూ.2కోట్లతో చిల్డ్రన్ పార్కు, రూ.90 లక్షలతో స్థానిక

అయ్యప్ప స్వామి మందిరం వద్ద ఆడిటోరియం నిర్మాణం, రూ.30 లక్షలతో స్మృతి వనం, రూ.5 కోట్లతో పట్టణ పరిధిలోని 65వ జాతీయ రహదారిపై సెంట్రల్ మీడియన్, డివైడర్ నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా వాటర్ ట్యాంకులు, రిజర్వాయర్లు, సంపుహౌజ్‌ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సకాలంలో బిల్లుల చెల్లించడం లేదని కాంట్రాక్టర్ చేతులెత్తేశారు.

మిషన్ భగీరథ తాగునీటి పథకం అమలు కోసం పట్టణానికి రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్ నెలలో రూ.37కోట్ల నిధులను మంజూరు చేసింది. 2017 నవంబర్‌లో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు పనులను ప్రారంభించారు. గత పాలకవర్గం, ఉన్నతాధికారులు పథకం పనుల పురోగతిపై కన్నెత్తి చూడలేదు. ప్రస్తుతం పట్టణంలో 3,482 తాగునీటి నల్లా కనెక్షన్లు ఉన్నాయి. భగీరథ పథకంలో భాగంగా అదనంగా మరో ఏడు వేల నల్లా కనెక్షన్లను ఏర్పాటు చేసి 110 కిలోమీటర్ల దూరం మేరకు తాగునీటిని సరఫరా చేసే కొత్త పైపులైన్ వ్యవస్థ నిర్మించాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సదాశివపేట పాత పట్టణం చుట్టూ ఉన్న లోతైన కందకాన్ని పూడ్చి అన్ని హంగులతో అందమైన రింగురోడ్డును నిర్మించేందుకు 2013-14లో రాష్ట్ర ప్రణాళిక నిధుల ద్వారా రూ.20.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు 2014 మే నెలలో, 2015 ఏప్రిల్ నెలలో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచి రింగురోడ్డు పనులను ప్రారంభించారు. మొదటి కాంట్రాక్ట్ సంస్థ పనులను మధ్యలోనే నిలిపివేసి పలాయానం చిత్తగించింది. అనంతరం కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ పనుల అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసిపోయి రెండేళ్లవుతున్నా చేసేందేమి లేదు. రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోయే నిర్వాసితులకే నష్టపరిహారాన్ని చెల్లించలేదు. పనుల పురోగతిపై పాలకులు, అధికారులు ఐదేళ్లల్లో ఏనాడు సమీక్షించిన పాపాన పోలేరు.

సదాశివపేట పట్టణంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం నేటికీ కరువే. ఈ సమస్యను తీర్చడానికి 2017లో టీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం రెండో విడత ద్వారా రూ.6 కోట్లను మంజూరు చేయించారు. ఈ పనులకు మంత్రి హరీశ్‌రావు 2017 ఫిబ్రవరి 20వతేదీన శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఈ మినీట్యాంక్‌బండ్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా ఇప్పటివరకు చేపట్టిన పనులు సైతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పట్టణంలో 60 ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా శిథిలం కావడంతో టీఆర్ఎస్ ప్రభుత్వం నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం ఆర్టీసీ సంస్థ అభివృద్ధి నిధుల ద్వారా రూ.64.37 లక్షలు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.64.37 లక్షలను మంజూరు చేసింది. ఈ పనులను 2017 నవంబర్‌లో మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. అధికారులు టెండర్లు పిలిచి బస్టాండ్ నిర్మాణం పనులను ఓ కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం ఈ బస్టాండ్ నిర్మాణం పనులను గుత్తేదారు సంస్థ అర్ధాంతరంగా నిలిపివేసింది.

# యువకుడిపై కత్తులతో దాడిచేసి దారుణ హత్య

నిజామాబాద్,నవంబర్16(ఆర్ఎన్ఎ): నిజామాబాద్‌లో దారుణ హత్య చోటుచేసుకుంది. నిజామాబాద్ కోటగల్లీలో కొందరు దుండగులు ఓ యువకుడిని కత్తులతో పొడిచి చంపారు. మృతదేహాన్ని ఇంట్లో నుంచి తీసుకొచ్చి రోడ్డుపై పడేశారు. మృతుడిని అబ్దుల్ ఫిరోజ్(23)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# శ్రీలంకలో మొదలైన అధ్యక్ష ఎన్నికల పోలింగ్

## భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

కొలంబో,నవంబర్16(ఆర్ఎన్ఎ): శ్రీలంక అధ్యక్ష పదవికి శనివారం ఉదయం పోలింగ్ ప్రారంభమైంది. ఈ క్రమంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటున్నారు. అయితే మైనార్టీ ముస్లిం ఓటర్లను తరలిస్తున్న బస్సులను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని అగంతకుడు కాల్పులు జరిపాడు. కొన్ని చోట్ల పోలింగ్‌ను అడ్డుకునేందుకు రహదారులపై టైర్లను కాల్చేశారు. రోడ్డుకు అడ్డంగా చెట్లను కొట్టేశారు. ఓటర్లను తరలిస్తున్న బస్సులకు పోలీసులు పహారా కాస్తున్నారు. బస్సులపై పలుచోట్ల రాళ్లు కూడా రువ్వారు. అయితే ఈ ఘటనల్లో ఎవరైనా గాయపడ్డారా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా, మాజీ రక్షణ మంత్రి గోటబయ్యా రాజపక్స, అధికార పార్టీ అభ్యర్థి సాజిత్ ప్రేమదాస, నేషనల్ పీపుల్స్ పవర్ సంకీర్ణ కూటమి అభ్యర్థి అనురా కుమార దిస్సన్నాయకే మధ్యే పోటీ ఉండనుంది. 1.59కోట్ల మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొననున్నారు.

# ఆర్టీసీ జెఎసి పిలుపుతో సమ్మె ఉధృతం

నిజామాబాద్,నవంబర్16(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్‌లో బస్సు రోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలువురు నేతలను ముందస్తు అరెస్టు చేశారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ప్రభాకర్, దేవారంలతో పాటు జేఏసీ నేత భాస్కర్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వామపక్ష నాయకులు రమేష్ బాబు, నూర్జహాన్ దండి వెంకట్‌ను కూడా అరెస్టు చేసి 3 టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె 43వ రోజుకు చేరుకోగా కార్మికులు ఎక్కడిక్కడే ఆందోళనలకు దిగారు. డిపోల ముందే బైఠాయించే యత్నాలను పోలీసులు అడ్డుకున్నారు.

పలుచోట్ల నేతలను అరెస్ట్ చేశారు. నిజామాబాద్ రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీ జేఏసీ, అఖిలపక్షం నాయకులు ఆందోళనలు నిర్వహించారు. డిపోలవారిగా ధర్నాలు నిర్వహించి ఆర్టీసీ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. ప్రధాన డిమాండైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనాన్ని కూడా పక్కన బెట్టామని, న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. రోజుకొకరు చొప్పున కార్మికులు మరణిస్తున్నారన్నారు. కార్మికులు ఆత్మబలిదానాలకు ప్రభుత్వానిదే బాధ్యతని, కార్మికులు ధైర్యంగా ఉండాలని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు. ధైర్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని నాయకులు కార్మికులకు సూచించారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల సమస్యల ను పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఆర్టీసీ ప్రైవేట్‌పరం చేస్తే కలిగే నష్టాలను వివరించారు. కార్మికులు

## ఎక్కడిక్కడ డిపోల ముందు నిరసనలు
## అడ్డుకుని అరెస్టులు చేసిన పోలీసులు

ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాన్ని అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను ప్రజలకు వివరించారు. సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీవ్రతరం చేస్తున్నారని, కార్మికుల సహనాన్ని పరిశీలిస్తున్నారని అన్నారు. కేసీఆర్ నియంత పాలనకు అంతమొందించాలని అన్నారు. ఢిల్లీలో చక్రం తిప్పుతానన్న కేసీఆర్‌కు నిజామాబాద్ ప్రజలు కవితను ఓడించి షాకిచ్చారని ఎద్దేవాచేశారు. సమ్మె నోటీసు ఇచ్చినప్పుడు చర్చలకు పిలువకుండా కాలయాపన చేశారని దుయ్యబట్టారు. కేసీఆర్ మీద కార్మికులు సమ్మె చేయడం లేదని, ఆర్టీసీ యాజమాన్యంపై సమ్మెకు వెళ్లారని అన్నారు. సమ్మె చేసినప్పుడు మొదటి రోజే ప్రభుత్వం కలుగ జేసుకునే పని ఏముందని ప్రశ్నించారు. కేసీఆర్ మాట వినకపోవడం వల్లే నియంతలా వ్యవహరిస్తున్నాడని అన్నారు. కే సీఆర్ తెలంగాణకు ముఖ్యమంత్రి కాకుండా రాజులాగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కార్మికులందరు రోడ్ల మీద ధర్నా చేస్తుంటే కేసీఆర్ నాలుగు గోడల మధ్య వెయ్యి మంది పోలీసులను పెట్టి ప్రెస్‌మీట్లు పెడుతున్నాడని అన్నారు. ఆర్టీసీ ఉద్యమం గొప్ప ఉద్యమమని చిన్నచిన్న కష్టాలు వస్తాయని కార్మికులు విజయానికి దగ్గరలోనే ఉన్నారని తెలిపారు. ధైర్యాన్ని కోల్పోవద్దని, ప్రస్తుతం కేసీఆర్‌కు వ్యతిరేకంగా చాలామంది ప్రజలు ఉన్నారని, వారి బాధలు తీర్చాలంటే కార్మికులు మాత్రమే తీరుస్తారని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఒక్క అడుగుకూడా వెనక్కు వేయద్దని తెలంగాణ భవితవ్యం కార్మికులపై ఉందన్నారు. ఎవరు పోరాటంలో పాల్గొన్నా చివరి వరకు పోరాటం చేయాల్సింది కార్మికులేనని, విజయం ఆస్వాదించాల్సింది కూడా కార్మికులేనని అన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



- దేశంలో ఎక్కడాలేని విధంగా రొయ్యల పెంపకం చేపట్టాం
- గంగపుత్రులు ఐకమత్యంగా ఉంటేనే పథకాలు పొందగలరు
- త్వరలో మత్స్య సంఘాలకు ఎన్నికలు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కరీంనగర్, నవంబర్16(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారిని ఆర్థికాభివృద్ధికోసం సీఎం కేసీఆర్ అనేక బృహత్తర పథకాలను అమలు చేస్తున్నారని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కరీంనగర్ జిల్లాలోని ఎల్ఎండీ జలాశయంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ జలకంఠ రకం రొయ్య విత్తనాలను వదలారు. పశువులను కూడా పంపిణీ చేశారు. అనంతరం లబ్దిదారులను ఉద్దేశించి మంత్రులు మాట్లాడారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రొయ్యల పెంపకం చేపట్టామని అన్నారు. మూడేళ్లుగా చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల మత్స్యకారులు మంచి లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఏ పథకాన్ని ప్రవేశ పెట్టినా సీఎం కేసీఆర్ ముందుచూపు కనబర్చుతున్నారు. ఈమధ్య కేంద్ర మంత్రి ఒకరు వచ్చి ఇక్కడ అమలవుతున్న పథకాలను పరిశీలించారని, చాలాబాగున్నాయని కితాబిచ్చారని తెలిపారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా తెలంగాణ గురించే చెబుతున్నారని మంత్రి తెలిపారు. ముదిరాజులు, గంగపుత్రులు ఐకమత్యంగా ఉంటేనే ప్రభుత్వ పథకాలు పొందగలరని, త్వరలో మత్స్య పారిశ్రామిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. సొసైటీలో సభ్యులను నమోదు చేయండని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ. 61 కోట్ల విలువైన చేప విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశామని, మత్స్య కారులకు 75 శాతం రాయితీతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి ఇతెలిపారు. సీఎం కేసీఆర్ కోరుకునేది ఒక్కటేనని, అందరు బాగుండాలి సుఖంగా జీవించాలన్నదే ఆయన ధ్యేయమని, అందుకే అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. అనంతరం మరో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మొక్కబడిగా చేపల పెంపకం చేపట్టాయన్నారు. కేసీఆర్ మాత్రం కులవృత్తులను కాపాడే లక్ష్యంతో చేపలు, రొయ్యల పెంపకం చేపట్టారని తెలిపారు. ఎల్ఎండీలో మంచినీటి రొయ్య పెంపకానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుంకె రవి శంకర్. మత్స్య శాఖ కమిషనర్ డా. సువర్ణ, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్మత్స్య, పశు సంవర్ధక శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవాజ్ విదేశీ చికిత్సపై ఆంక్షలు లేవు

## ఆయన పట్ల సానుకూలంగానే ఉన్నా: ఇమ్రాన్

ఇస్లామాబాద్,నవంబర్16 (ఆర్ఎన్ఎ): పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు విదేశాల్లో వైద్య చికిత్స విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ వివరణ ఇచ్చారు. మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ అంటే తనకు ఎలాంటి పగ లేదని, రాజకీయాల కంటే ఆయన ఆరోగ్యం తనకు ఎంతో ముఖ్యమంత్రి ఇమ్రాన్‌ఖాన్ వివరణ ఇచ్చారు. నవాజ్ షరీఫ్‌కు విదేశాల్లో వైద్యచికిత్స చేయించేందుకు వెళ్లకుండా ఎగ్జిట్ కంట్రోల్ లిస్టు (ఈసీఎల్)తోపాటు నో ఫైల జాబితాలో పేరు పెట్టారని, తన సోదరుడికి ఏమైనా జరిగితే ఇమ్రాన్ ఖానే బాధ్యత వహించాల్సి ఉంటుందని మాజీ ప్రధాని సోదరుడైన పీఎంల్ పార్టీ నాయకుడు షెహబాజ్ షరీఫ్ ఆరోపించిన నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్ తాజాగా వివరణ ఇచ్చారు. తన ప్రభుత్వం మానవత్వంతో నవాజ్ షరీఫ్‌కు విదేశాల్లో వైద్యచికిత్స చేయించుకునేందుకు చర్యలు తీసుకుందని, కాని ఈసీఎల్ జాబితాలో ఆయన పేరు ఉన్నందున న్యాయ సహాయం పొందాలని ఇమ్రాన్ సూచించారు. పీటీఐ కోర్ కమిటీ సమావేశంలో పార్టీ నేతలతో మాట్లాడుతూ ఇమ్రాన్ ఖాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సీఎల్ జాబితాలోనుంచి పేరు తొలగిం చేందుకు నవాజ్ షరీఫ్ ఇండెమ్నిటీ బాండ్ సమర్పించాలని, అలా బాండ్ సమర్పించకుంటే షరీఫ్ కుటుంబసభ్యులు కోర్టును ఆశ్రయించాలని ఇమ్రాన్ సలహా ఇచ్చారు. నవాజ్ షరీఫ్ 7 బిలియన్ల పాక్ రూపాయల పూచీకత్తు సమర్పించి, ఒకసారి నాలుగు వారాల పాటు విదేశాల్లో వైద్యచికిత్స పొందేందుకు అనుమతి స్తున్నట్లు పాక్ మంత్రిత్వశాఖ ప్రకటించింది. కాగా పూచీకత్తుపై నవాజ్ షరీఫ్ సోదరుడు లాహోర్ హైకోర్టును సంప్రదించగా కోర్టు నో ఫైల లిస్టులో నుంచి నవాజ్ పేరు తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా నవాజ్ షరీఫ్ ఆరోగ్యం విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు రాజకీయం చేస్తున్నారని ఇమ్రాన్‌ఖాన్ ఆరోపించారు.

# గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన కలెక్టర్ హరిత



వరంగల్ రూరల్, నవంబర్ 16(నేటినిజం ప్రతినిధి): సూర్యాపేట కలెక్టర్ అమయ్ కుమార్, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర రమణ రెడ్డి ఇచ్చిన గ్రీన్ ఛాలెంజ్ ను వరంగల్ రూరల్ కలెక్టర్ హరిత స్వీకరించారు. ఇందులో భాగంగా ఈరోజు కలెక్టరేట్ లో ఆరు మొక్కలను నాటారు. సూర్యాపేట కలెక్టర్ అమయ్ కుమార్ ఇచ్చిన గ్రీన్ ఛాలెంజ్ ని స్వీకరించి మొదలు 3 మొక్కలను నాటిన తరవాత, మరో ముగ్గురికి నర్సంపేట శాసన సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి, అర్బన్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ , సీపీ రవీందర్ లకు ఛాలెంజ్ ని విసిరారు.

ఆ తరువాత భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర వెంకట రమణ ఇచ్చిన గ్రీన్ ఛాలెంజ్ లో భాగంగా 3 మొక్కలను నాటి మరో ముగ్గురికి జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, పరకాల శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి, జనగామ కలెక్టర్ వినయ్ క్రిష్ణారెడ్డిలకు గ్రీన్ ఛాలెంజ్ ను ఇచ్చారు. గ్రీన్ చాలెంజ్ ప్రారంభించిన రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ ను కలెక్టర్ అభినందించారు.

# హస్తిన చేరుకున్న జనసేన అధినేత పవన్

## పలువురు ప్రభుత్వ పెద్దలను కలిసే ఛాన్స్?

న్యూఢిల్లీ,నవంబర్16(ఆర్ఎన్ఎ): జనసేనాని పవన్ కళ్యాణ్ హఠాత్తుగా ఢిల్లీకి చేరుకున్నారు. అజెండా ఏమిటో తమకు కూడా పూర్తిగా తెలియకపోయినా.. కేంద్ర పెద్దలను కలుస్తారని జనసేన నేతలు చెబుతున్నారు. ఎవరిని కలుస్తారు.. ఏ అంశాలపై చర్చిస్తారనేది రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది. ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. కానీ అంతకుమించిన విషయాలున్నాయని అంతర్గతంగా జనసేన నేతలు చెబుతున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ పెద్దల్ని కలుస్తారని ప్రచారం జరుగుతోంది. ఏపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్న పవన్ తనపై జరుగుతున్న వ్యక్తిగత దాడిని సీరియస్‌గా తీసుకున్నారు. భవననిర్మాణ కార్మికుల పరిస్థితి, అమరావతి వంటి అంశాలతో పాటు ఏపీలో వ్యక్తిగతంగా టా÷-గ్గ÷ట్ చేస్తూ జరుగుతున్న రాజకీయంపై అవసరమైతే కేంద్రానికి ఫిర్యాదు చేస్తానని ఇప్పటికే పవన్ ప్రకటించారు. కూలీల ఆత్మహత్యలు పెరిగి పోతుండడంతో ఆయన ఈ విషయాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లుగా చెబుతున్నారు.

ఢిల్లీలో పవన్‌కు ఎవరెవరి అపాయింట్‌మెంట్లు ఖరారయ్యారనే విషయంపై జనసేన వర్గాలు మౌనంగా ఉన్నాయి. కానీ కీలకమైన మంతనాలు జరగడం ఖాయమని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల సమయాన్ని బట్టి వారిని కూడా కలుసుకుంటారని ఊహాగానాలు వినపడు తున్నాయి. కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ఒకరిద్దరు నేతలను పవన్ కలుసుకునే అవకాశాలున్నాయని చెబుతున్నారు. 2014 ఎన్నికలకు ముందు అహ్మదాబాద్ వెళ్లి మోదీతో పవన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచారాలు, ఇతర సందర్భాల్లో తప్ప ప్రత్యేకంగా భేటీ జరుగలేదు. అయితే మోదీపై తనకు ఎంతో అభిమానం ఉందని, మోదీ కూడా తనపై ఎంతో అభిమానం చూపిస్తారని పవన్ చెబుతూ ఉంటారు. కొంతకాలం నుంచి మోదీ అపాయింట్‌మెంట్ కోసం పవన్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు పీఎంవో నుంచి పిలుపు వచ్చిందని ప్రచారం జరుగుతోంది. పవన్ పర్యటన ప్రత్యేకంగా ఉంటుందని, ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనూహ్య పరిణామాలుంటాయని జనసేన వర్గాలు చెబుతున్నారు.

# కొత్తగూడెంలో ఆర్టీసీ సమ్మె ఉధృతం

## మహిళా కండక్టర్ల ఆందోళనతో ఉద్రిక్తత

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్16(ఆర్ఎన్ఎ): భద్రాద్రి కొత్తగూడెంలో ఆర్టీసీ సమ్మె కొంత ఉద్రిక్తతకు దారితీసింది. డిపోల ముందు బైఠాయించేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని 43వ రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం పరిష్కారం చూపకపోవడం తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో ఉదయం నుండే కార్మికులను ముందస్తుగా అరెస్ట్ చేయడం జరిగింది. డిపోలో పనిచేస్తున్న మహిళా కండక్టర్లు 8 మంది ఆర్టీసీ యూనియన్ సంఘం కార్యాలయంలో రూమ్ లో తలుపులు వేసుకొని బస్సులు బయటకు వెళ్లలేదని వెళితే మేము పెట్రోల్ పోసుకుని చనిపోతామని హల్చల్ చేయడం జరిగింది .పోలీసులు రంగప్రవేశం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. చివరకు ఆర్టీసీ జెఏసి సంఘం నాయకులు వచ్చి మహిళా కండక్టర్లను బయట తీసుకోవడం జరిగింది .అనంతరం బస్సు స్టాండ్ డిపో గేటు ముందు మహిళా కండక్టర్లు, కండక్టర్లు ధర్నా చేయడం జరిగింది. పోలీసు వారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

# కోహెడలోనే మామిడి పండ్ల మార్కెట్



హైదరాబాద్,.నవంబర్ 16: వచ్చే వేసవిలో మామిడి పండ్ల క్రయవిక్రయాలు ఈసారి గడ్డిఅన్నారం మార్కెట్‌లో కాకుండా కోహెడలోనే జరుగుతాయని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరమల్ల రాంనర్సింహ గౌడ్ అన్నారు. శుక్రవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రథమ సమావేశం మార్కెట్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంనర్సింహాగౌడ్ మాట్లాడుతూ వచ్చే మామిడి సీజన్ నాటికి కోహెడలో మార్కెట్ కార్యకలాపాలు నిర్వహించేలా నిర్మాణాలు పూర్తి చేయాలని సమావేశంలో తీర్మాణించినట్లు తెలిపారు. అందుకుగాను కోహెడలో తాత్కాలిక షెడ్లు నిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

రాష్ట్ర మంత్రివర్యులు కేటీఆర్ ఆదేశాల మేరకు చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రతి సోమవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం, సభ్యులు, కార్యాలయ సిబ్బంది అందరూ విధిగా చేనేత వస్త్రాలు ధరించే విధంగా ఏకగ్రీవంగా తీర్మాణించామని తెలిపారు. రైతన్నల సంక్షేమం కోసం మార్కెట్‌కు వచ్చే వారికి అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు మార్కెట్ పాలకవర్గం పనిచేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం వైస్‌చైర్మన్ కందాడ ముత్యంరెడ్డి, డైరెక్టర్లు షాగ రవీందర్, పన్నాల కొండల్‌రెడ్డి, ఆడాల రమేశ్, సుంకోజు కృష్ణమాచారి, మొద్దు లచ్చిరెడ్డి, బి.క్రాంతి ప్రభాత్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ ఇబ్రహీం, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఇ.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# కత్తితో నృత్యం చేసిన స్మృతి

అహ్మదాబాద్,నవంబర్16(ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కత్తి చేతపట్టి నృత్యం చేశారు. భావ్‌నగర్‌లో జరిగిన ఓ కల్చరల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్మృతి ఇరానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి వేదికపై విద్యార్థులు తల్వార్ రాస్ నృత్యం చేశారు. ఈ నృత్యం ప్రత్యేకత ఏమిటంటే.. కత్తులు చేత పట్టుకుని నృత్యం చేయడం. విద్యార్థులతో పాటు స్మృతి ఇరానీ కూడా కత్తులు పట్టుకుని నృత్యం చేశారు. పిల్లలకు తగ్గట్టు ఆమె స్టెప్పులు వేశారు. ఇప్పుడు ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# ఖమ్మంలో కొనసాగిన ఆందోళనలు

## సర్కార్ తీరుపై కార్మికుల విమర్శలు

ఖమ్మం,నవంబర్16(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల సమ్మె 43వ రోజుకు చేరడంతో ఖమ్మంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. సర్కార్ తీరుపట్ల కార్మికులు నినాదాలు చూసస్తా డిపోల ముందు బైఠాయించే యత్నం చేశారు. సమ్మెపట్ల ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఆర్టీసీ కార్మికులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆందోళనలను ఉధృతంగా కొనసాగిస్తున్నారు. ఖమ్మం డిపో ఎదుట రాజకీయ నాయకులు, కార్మికులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు నిర్వహించిన ఆందోళనలకు విపక్ష, కార్మిక సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతునిచ్చారు. కొత్తగూడెం ఆర్టీసీ డిపో వద్దకు ఆర్టీసీ జేఏసీ, విపక్ష, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తెల్లవారు జామున చేరుకుని బస్సులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. విధుల్లోకి రావొద్దంటూ తాత్కాలిక కార్మికులకు సూచించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని బయటికి పంపారు. అనంతరం విపక్ష నాయకులు, ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రభుత్వ వైఖరికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. డిపో వద్ద ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు బయటికి పంపగా.. బస్సుల రాకపోకలు కొనసాగాయి. ఆర్టీసీ జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో బస్సులు బయటికి రాకుండా అడ్డుకున్నారు. తాత్కాలిక సిబ్బంది విధులకు వెళ్లొద్దని ఆర్టీసీ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనకారులను బయటికి పంపారు.

# టూరిజం ప్లాజాలో నగర సమన్వయ సమావేశం

హైదరాబాద్, నవంబర్16: నగరంలోని బేగంపేట టూరిజం ప్లాజాలో నగర సమన్వయ సమావేశం ప్రారంభమైంది. సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పలుశాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై అధికారులు చర్చించనున్నారు.

Printed, Published and owned by VEENADAS, at
Freedom Publications, SRT-74, Jawahar nagar,
Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.